వర్షానికీ వరదకీ సూచన్లు వున్నాయి. చాపక్రింద ప్రవహించే నీటి ప్రమాదం మునిగేవరకూ తెలీదు.

అంతలో తలుపు చప్పుడయింది. ప్రవల్లిక లోపలికి వచ్చింది. అలసిపోయి వున్నట్టు కనిపించిందామె. విహారి మనసులో ఏదో తెలియని ఆప్యాయత కలిగింది. ఎంతో దగ్గరగా అనిపించింది బహుశా అతను చేసుకున్న అపార్థం వల్ల కావచ్చు.

వాళ్ళిద్దరూ మాట్లాడు కోవాలనుకుంటున్నారని గ్రహించి అతడు లేచాడు. బయటకు వెళ్లబోతూ ఒక్క ప్రశ్న అడగవచ్చా అన్నాడు.

ప్రవల్లిక ఆయన అతడి వైపు చూశారు.

నన్నెందుకు పిలిపించారు? ఇదంతా నాకెందుకు చెప్పారు?

ఆయన వెంటనే సమాధానం చెప్పలేదు. తర్వాత నెమ్మదిగా అన్నడు నా ఒక్కగానొక్క కొడుకు కెనడాలో ఇంజనీరింగు చదివే వాడు. కెనడా టెర్రరిస్టులకు నెలవు. వాళ్ళ మీటింగ్‌లో బాహాటంగా ఎదిరించిన వాడు అతడొక్కడే సామాన్యులెప్పుడూ భయపడతారు. మనసులోది బయటకు చెప్పరు. కొంతమంది మాత్రమే తమకు సంబంధం లేకపోయినా నిజాయితీగా ఎదురు తిరుగుతారు అధర్మాన్ని వ్యతిరేకిస్తారు. నా కొడుకులాగే ప్రాణాలు వదిలాడు. నీలో అతడి పోలికలు కనపడ్డాయి అందుకే పిలిపించాను.

అతడు ప్రవల్లిక వైపు చూశాడు. అతడినే చూస్తూన్న ఆమె కళ్ళు తిప్పుకుంది. అతడు బయటకు వచ్చాడు

బయట వెన్నెల పిండారబోసినట్టు వుంది. కారిడార్‌లో నిలబడ్డాడు అయిదు నిమిషాలు తరువాత ప్రవల్లిక బయటకు వచ్చింది. ఇద్దరూ కార్ల దగ్గరికి నడుస్తూండగా అయామ్ సారీ అన్నాడు.

ఆమె చిరునవ్వుతో అతడివైపు చూసింది.

అతడు కాసింత సిగ్గుతో నాకు బాగా కోపం వచ్చింది. నిజం చెప్పాలంటే అక్కడే తందామన్నంత ఉక్రోషం కూడ కలిగింది అన్నాడు. ఆమె ఫకాలున నవ్వేసింది. అప్పటివరకూ వున్న టెన్షన్ పోయినట్టు కనిపించింది.

ఆమె కారు ఎక్కబోతుంటే జరిగిదంతా మర్చిపోతారు కదూ అన్నాడు.

ఆమె అప్రయత్నంగా అతడి చేతి మీద చెయ్యివేసి ఏం జరిగిందనిప్పుడు? హాయిగా నిద్రపోండి స్వీట్ డ్రీమ్స్ అంది.

అతడలాగే నిలబడి వున్నాడు.

ఆమె తాలుకు ఇంటిమేట్ పరిమళం అతన్నింకా వదల్లేదు ఇంటిమేట్ సెంటు పేరు కాదు. ఇంటిమేట్ అంటే దగ్గిరతనం తన ఆలోచన అతనకే గిల్టీగా అనిపించింది. పెళ్ళి నిశ్చయమైన అమ్మాయి గురించి అటువంటి ఆలోచన రావటం .....

*　　　　　*　　　　　*

ఆ మరుసటిరోజు 4.50 కి అతడికి ఫోన్ వచ్చింది.

హల్లో....

నేను.

నేనంటే.

నిన్న ఫోన్ చేసిన అమ్మాయిని .....

ఓ నువ్వా .....

ఏమిటి? గుర్తుపట్టేశారా?

నిన్న కలిశాంగా.

కరెక్ట్.

నిన్న నీకు భయం వేసిందనుకుంటాను

కొద్దిగా కాదు బాగా .....

ఎందుకు నీకంత భయం?

అందులో సగం నటనే అది తెలుసుకోలేక పైకి కనబడేదంత నిజమని మీలాంటి అర్భకులు నమ్మేస్తూ వుంటారు.

ఏమిటి? అర్భకులా?

మరిలేకపోతే? మీకన్నా అదేదో నవల్లో హీరోయే నయం ముక్కూ మొహం తెలియని అమ్మాయిని పట్టుకున్నాడు. నేను మాత్రం వరుసగా ఫోన్‌లు చెయ్యను. మాగ్జిమమ్ మరొక్కసారి.

ఫోన్‌లో ఇలా చెలరేగిపోతావ్ ఎదురుపడితే అలా వణికిపోతావ్ ఎందుకు?

ఎదురుగా చెప్పలేనంత భయం వుంటేనే ఇలా ఫోన్‌లతో చెప్తారు మహానుభావా!

నువ్వు చెప్పలేదు నేనే చెప్పాననుకో. అయినా చెయ్యిపట్టుకోగానే వణికిపోతావ్ కదా.

దాన్ని వణుకు అనరు కంపనం అంటారు

మైగాడ్ చెయ్యి పట్టుకుంటేనే స్నానం చేసే అమ్మాయేనా ఇలా మాట్లాడుతుంది?

అమ్మాయిలు స్నానం చెయ్యరని మీకేదో దురభిప్రాయం వున్నట్టుందే.

..... స్నానం చేసినమాట నిజమే గానీ అలా స్నానం చెయ్యటానికి ముందు మీరు పట్టుకున్న చేతిని 16, 832 సార్లు ముద్దు పెట్టుకున్నాను ప్చ్ ..... ప్చ్ ..... ప్చ్ ..... ఇలా .....

విహారి చప్పున లేచి నేనిక అగలేను. ఇప్పుడే వస్తున్నా అన్నాడు అతడిలో ఆవేశం కన్నా తనన్ని ఇంత ఏడిపిస్తూ కనిపించినప్పుడు అమాయకత్వం నటించే ఆ అమ్మాయి మీద పీకెల వరకూ కోపం వుంది. అటో ఇటో తేల్చేయ్యాలనుకున్నాడు.

చూడు బాబు చాలా మంది అమ్మాయిలు మొహానికి వేసుకున్నట్టే మనసుకి కూడ మేకప్ వేసుకుంటారు. శోధించాలి సాధించాలి అదియే ధీరగుణం అన్నాడో కవి అందుకే.

శోధన లేదు సాధన లేదు రేపు చెప్తా నీ పని.

రేపటి వరకూ ఎందుకు? ఈరోజు సరిగ్గా ఆరింటికి ప్రేమ్ నగర్ జంక్షన్ దగ్గరకొస్తే

నలుగురి ముందూ నిజం ముద్దిస్తా.

విహారి అదిరిపడి అంత ధైర్యం వుందా అన్నాడు.

వచ్చి చూడు తెలుస్తుంది. అన్నట్టు నన్ను గుర్తుపట్టగలవో లేదో కేవలం రెండు నిముషాలే ఉంటా పోతే వైట్ డ్రెస్‌లో వుంటాను ఫోన్ కట్ అయింది.

ఏ డ్రెస్సు లేకపోయినా గుర్తుపట్టగలను ఫోన్ కసిగా పెట్టేశాడు.

ఆ సాయంత్రం ఆరుకి అతడు ప్రేమ్‌నగర్ జంక్షన్‌లో టంచనుగ వెయిట్ చేశాడు.

రోడ్డు రష్‌గా వుంది.

సునాదమాల రెండు నిముషాల పాటే వుంటానంది. ఆ టైమ్ చాలు అతడు నాలుగువైపులా చూస్తూ రెడీగా వున్నాడు. రోడ్డుమీద ఆడవాళ్ళు ఎక్కువలేరు. గుడిగంటలు మ్రోగుతున్నాయి దూరంగా చర్చి కనపడుతూంది. కాన్వెంట్‌లోంచి పిల్లలు ఎన్.సి.సి ముగించుకుని వస్తున్నారు. మరో పక్క నర్స్ క్వార్టర్స్ వున్నాయి చర్చిలోంచి నర్స్ కనపడుతున్నారు.

అతడు నిటారుగా అయ్యాడు.

గుళ్ళోంచి బామ్మలు కూడ తెల్లచీరల్లో వస్తున్నారు

రెండు నిముషాల్లో అక్కడంతా తెల్లదనం పరుచుకున్నట్టు అనిపించింది. అతడు ఉక్కిరి బిక్కిరి అయ్యాడు. పదమూడేళ్ల ఎన్.సి.సి అమ్మాయిల్నుంచి అరవయేళ్ల ముసలివాళ్ళ వరకూ అందరూ తెలుపే.

ఆ గుంపులో అతడి తీక్షణమైన కళ్ళు గుర్తుపట్టాయి. తెల్లచీరలో వస్తోంది ..... అయితే ఆ వస్తున్నది సునాదమాల కాదు.

బామ్మ

చేత్తో కొబ్బరి ముక్కలు పట్టుకు వస్తోంది.

అతడు ఆవిడ దగ్గరకి వడివడిగా వెళ్ళాడు.

బావున్నవా బాబూ అంది.

బావున్నానండీ మీ అమ్మాయి బావుందా?

బావుంది నాయినా

అతడు కోపాన్ని అణుచుకుంటూ మీరు ప్రతిరోజూ ఈ టైమ్‌కి గుడికోస్తారా అని అడిగాడు.

అబ్బే ఇంత దూరం నేనెక్కడ రాగలను నాయినా నిన్న జరిగిన దానికి మా మనవరాలు బెదిరిపోయి దేముడికి మొక్కుకుందట అది తీర్చడానికి నన్ను పంపింది. కొబ్బరికాయ కొట్టి వస్తున్నాను.

సునాదమాల తననెంత గొప్పగా ఫూల్‌ని చేసిందో అతడికి అర్థమైంది.

రేపు మీ అమ్మాయికి ఖాళీ వుందాండీ?

ఉంది నాయినా ఏం అలా ఆడుగుతున్నవు?

అబ్బే ఏంలేదు వెళ్ళొస్తానండీ.

అతడు విసురుగా వచ్చి కార్లో కూర్చొని స్టార్టు చేసి వేగంగా అక్కణ్నుంచి పోనిచ్చాడు.

అతడు పావుగంట సేపు కార్లో కూర్చుని ఇటూ అటూ చూడటాన్నీ తరువాత గుడివైపు వెళ్ళటాన్ని ప్రవల్లిక దూరం నుంచి చూస్తోంది అతను ఏవరో ముసలావిడతో మట్లడటం గమనించింది. ఎందుకో అర్థం కాలేదు. అతడు కోపంగా వెళ్ళిపోయాక చేతిలో బైనాక్యులర్స్ పక్క సీట్లో పడేసి తనలో తను నవ్వుకుంటూ కారు స్టార్టు చేసింది.

ఆమె తల్లచీరెలో వుంది.

*   *   *

నిన్న కట్టుకుంటానన్న చీరే ఈ రోజు కట్టుకున్నావేం?

సునాదమాల అదిరిపడి చేతిలో పుస్తకాలు వదిలేసింది. అప్పుడే కాలేజి వదిలారు. అమ్మాయిలు గుంపుగా వస్తున్నారు.

ఈరోజు అటో ఇటో తేల్చుకుందామని వచ్చాను నిక్కచ్చిగా అన్నాడు. ఆ అమ్మాయి వణికే చేతుల్తో పుస్తకాలు ఏరుకుంటూ ప్లీజ్ నన్నల్లరి పెట్టకండి అంది.

ఏమిటి అల్లరిపెట్టేది? నువ్వు చాలా గొప్పగా నటించగలవని వప్పుకుంటున్నాను. ముందు మట్టి బుర్ర అనుకున్నాను. కాదని నిరూపించావు ఇంకా ఎందుకు ఈ ముసుగులో గుద్దులాటా?

చూడండీ నేనలాంటిదాన్ని కాదని చెప్పాను.

అతడు చేతులు జోడించి ఓడిపోయానని వప్పుకుంటున్నగా అన్నాడు

ఆమె మట్లడకుండా నడక సాగించింది.

నాకు నిన్న ఇస్తాన్న ముద్దు ఇవ్వకపోతే ఇక్కడే నడిరోడ్డు మీద పెట్టేసుకుంటాను!

ఆమె మేకు దిగ్గొట్టినట్టు ఆగిపోయింది.

సారీ నేనో అనాగరికుణ్ని అనుకుంటున్నట్టున్నావు. నా ఉద్దేశ్యం ఫోన్ చేస్తూంది నువ్వేనని నాకు తెలిసిపోయినట్టు చెప్పడమే నా బరువెంతో చెప్పినప్పుడే తెలిసింది.

ఆమె తెల్లబోయి బరువు చెప్పానా అంది.

బరువు చెప్పలేదూ చేతిని ఎన్ని సార్లు ముద్దు పెట్టుకున్నదీ చెప్పలేదూ?

ఉన్నట్టుండి ఆ అమ్మాయి ఏడవడం మొదలు పెట్టింది

రోడ్డుమీద జనం అంతా చుట్టూ మూగారు.

## 11

కొన్ని కొన్ని సంఘటనలకి లింకులుండవు. ఎక్కడో ప్రారంభమయి ఎక్కడో పూర్తి అవుతాయి అలాంటి సంఘటనే ఆ రోజు విహారికి జరిగింది. అతడు సాధారణంగా డ్రింక్ చెయ్యడు. కానీ ఆ రోజు ఎందుకో బార్‌కి వెళ్ళాలనిపించింది.

అతడి మనసు డోలాయమానంగా వుంది. ప్రవల్లిక సామీప్యం అతడికెంతో హాయినిస్తుంది

ముఖ్యమంత్రి చాంబర్ నుంచి బయటకొస్తూ ఆమె కనబర్చిన హుందాతనం అతడికి ఆమె తనకెంతో దగ్గర అన్న భావాన్ని కలుగచేసింది.

ఆ గ్రేస్ సాధారణంగా ఎవరికోగానీ వుండదు. ఆమెని చేసుకో బోయేవాడు. అదృష్టవంతుడు అంతే అతడి ఆలోచనలు అంతవరకూ వచ్చి అగిపోయాయి. ప్రతిసారీ ఆమెకి కాబోయే వరుడు గుర్తొస్తాడు బలవంతంగా ఆలోచనలు మళ్ళించుకుంటాడు.

ఈసారి సునాదమాల గుర్తొచ్చింది స్టేజిమీద ఆమెని చూసిన మొదటి చూపులోనే ఆ అద్భుతమైన అందానికి ముగ్ధుడయ్యాడు. తర్వాత అమె పిరికితనం బెరుకుచూసి సరదాగా ఏడిపించేవాడే తప్ప. ప్రత్యేకమైన అభిప్రాయంగానీ ప్రేమగానీ ఏమీ ఏర్పర్చుకోలేదు. కానీ వరుసగా ఆమె నుంచి ఫోన్‌కాల్స్ వచ్చి ఆమె తెలివి తేటలు అన్యాపదేశంగా తెలుస్తూ ఉండడంతో ఆమె అంటే అభిమానం నిన్ను ప్రేమిస్తున్నాను అని ఆమె ద్వారా చెప్పించాలన్న పట్టుదల ఎక్కువయ్యాయి.

ఒక వ్యక్తి ఒకేసారి ఇద్దర్ని ప్రేమించగలడా అంటే..... రచయితలు పవిత్ర సంఘ సభ్యులు సామాజిక ప్రవర్తనా పరిరక్షకులు లేదు లేదు అసంభవం అని నొక్కి వక్కాణిస్తారేమోగానీ మనసు నియమ నిబద్ధముల కతీతము కదా అది కోతి లాంటిది. ఇద్దర్నీ ఒకేసారి ప్రేమించే స్థితి నాకెప్పుడూ రాలేదు అని ఏవరయినా అంటే వారిని ఈర్ష్యతో చూసే స్టేజికొచ్చాడు విహారి. అతడు సంస్కారవంతుడు కాబట్టి ప్రవల్లిక పట్ల ప్రేమని కూడ తనలోనే నొక్కెయ్యటానికి ప్రయత్నిస్తున్నాడు. ఈలోపులో సునాదమాల క్రమ క్రమంగా అతడి హృదయాన్ని అక్రమించుకుంటోంది.

ఏది ఏమైనా రోజు అతడు బార్‌లో ఒంటరిగా కూర్చోటానికి కారణం ఆ ఇద్దరమ్మాయిలే.

బిల్ పే చేస్తూన్న విహారి దృష్టి ఒక విదేశీయుడి మీద పడింది. అతడు పూర్తిగా పశ్చిమ దేశాలకి సంబంధించిన వాడూ కాదు, ఇటు రష్యా చైనాలకి సంబంధించిన వాడూ కాదు క్రాస్ బ్రీడులా వున్నాడు. అతడిని వింతగా గమనించి కళ్ళు తిప్పుకో బోతూండగా మరో వ్యక్తి వచ్చి అతనితో మాట్లడటం గమనించాడు.

ఆ వ్యక్తిని చూసి విహారి అదిరిపడ్డాడు.

ఆడవిలోకి తమని తీసుకెళ్ళిన టెర్రరిస్టుల్లో ఒకడు.

తను కనపడకుండా స్తంభం చాటునుంచి వాళ్ళ మాటలు వినటానికి ప్రయత్నించాడు. మాటల సందర్భంగా ఆ విదేశీయుడు పేరు వినపడింది.

అది మరోక షాకు అతడి పేరు.

రామోన్ హర్నాసే!!

విహారికి పేపర్ నాలెడ్జి వుంది. తూర్పు ద్వీపాల్లో తిరుగుబాటు లేవదీస్తున్న కల్నల్ ఇక్కడ ఓ ఫైవ్‌స్టార్ హోటలో బార్లో ..... అతి సమాన్యుడిగా .....

అతడు బార్ నుంచి వెళ్ళి రిసెప్షన్ నుంచి ప్రవల్లికకి ఫోన్ చేశాడు.

ప్రయత్నించి లోయలోకి కూలిపోయిన టెర్రరిస్టు కనపడ్డాడనగానే ఆమె చాలా ఎగ్జయిట్ అయింది. ఆ ఉద్వేగంలో మరోలా జరిగితే ఎలా? అని ఆలోచిచంకుండా అక్కడే వుండండి వస్తున్నాను అని బయల్దేరింది భయపడ్డంతా జరిగింది.

ఆమె అక్కడికి చేరేలోపు రామోన్ హర్సేసే లేచి ఆ టెర్రరిస్టుకి షేక్‌హాండిచ్చి బయటకు నడిచాడు. ఇలా జరుగుతుందని అతను ఊహించలేదు. ఫోన్‌లో సూచన ఇచ్చినప్పుడు విహారి చిక్కుల్లో పడ్డాడు. అతడ్ని అనుసరించాలో ఇక్కడే వుండాలో తెలియలేదు. అదే సమయానికి అతడు మరో పెగ్ తెప్పించుకున్నాడు. అంతే ఇంకో పావుగంటపైగా ఉంటాడన్న మాట అని అనుకోని తను రామోన్ హర్సాసేని అనుసరించటానికి నిశ్చయించుకున్నాడు. బయటకెళ్ళి అతడిని ఫాలో అయ్యాడు.

విహారి సామాన్య పౌరుడు అతడికి పరిశోధనా పద్ధతులు తెలియవు అదే మరొక సిబిఐ ఆఫీసరయితే చేతికి దొరికిన టెర్రరిస్టుని వదిలే వాడు కాదు. హర్సాసేనే వదులుకునేవాడు తెలియక చేసినా విహారి రామోన్ను అనుసరించటమే మంచిదయింది.

అతడు వెళ్ళిపోయిన పది నిమిషాలకి ప్రవల్లిక మఫ్టీలో ఉన్న ఆరేడుగురు సి.బి.ఐ ఆఫీసర్లతో ఆ బార్ దగ్గిరకొచ్చింది. లోపలున్న వాడిని అరెస్టు చెయటం ఆమె కిష్టం లేదు. అతడి ద్వారా అసలు వ్యక్తిని పట్టుకోవాలని ఆమె ఉద్దేశం బయట వెయిట్ చేయసాగింది.

గంట తరువాత అతను బయటకొచ్చాడు.

ఆఫీసర్లు నిశ్శబ్దంగా అతడిని వెంటాడారు.

దీన జన రక్షక సమితి ఆశ్రమంలో అతడు ప్రవేశించాడు. ఆమె ఆశ్చర్యపోయింది. ఆ ట్రస్టుకి అనంతానంత స్వామి మానేజర్ అని తెలుసు ఎంతో అవసరం ఉంటే తప్ప ఆ టెర్రరిస్టు ఇక్కడికి రాడు.

తాము ఇప్పటికయినా వాళ్లని గుర్తుపట్టగలిగారు కాబట్టి ఆ టెర్రరిస్టులని స్వామి ఈపాటికే కొన్నివేల మైళ్ళ దూరం పంపించేసి ఉంటాడనుకుంది ఆమె అయినా ఇక్కడే వున్నారంటే ఏదో వ్యవహారం జరుగుతూందన్న మాట.

ఏమిటది?

ఆమె దాని గురించి ఆలోచించకుండా ఆఫీసర్లకి సూచన్లు ఇచ్చింది.

దాదాపు పది నిమిషాల తరువాత వారికి కావల్సింది దొరికింది.

ఆయుధాల గిడ్డంగి..... చిన్నది లక్ష రెండు లక్షలు విలువలు చేసే ఆయుధాలు ఉంటాయి.